క్లుప్తంగా

న్యాయవాదులకు సన్మానం



సన్మానిస్తున్న లయన్స్‌క్లబ్ ప్రతినిధులు

సుల్తానాబాద్: లయన్స్ క్లబ్ ఆఫ్ సుల్తానాబాద్ ఆధ్వర్యంలో బుధవారం జాతీయ న్యాయవాదుల దినోత్సవం సందర్భంగా న్యాయవాదులను సన్మానించారు. సుల్తానాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పడాల శ్రీరాములు, సీనియర్ న్యాయవాదులు ఆవుల లక్ష్మీరాజం, శివకుమార్‌ను సన్మానించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు మాటేటి సంజీవ్‌కుమార్, జిల్లా కో–ఆర్డినేటర్ వల్స నీలయ్య, పిట్టల వెంకటేశ్, పూసాల సాంబమూర్తి, కోడూరి సతీశ్, ఆడెపు సదానందం, తమ్మనవేణి సతీశ్, దాసరి ప్రసాద్ పాల్గొన్నారు.

నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన



నల్లబ్యాడ్జీ ధరించి విధులు నిర్వహిస్తున్న మీసేవా కేంద్రం ఉద్యోగులు

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం ఎఫ్‌సీఐ క్రాస్‌రోడ్ మీసేవా కేంద్రం ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి విధులు నిర్వహించారు. క్రాస్‌రోడ్‌లోని ప్రభుత్వ మీసేవా కేంద్రం మేనేజర్ పల్లె బాపు, కంప్యూటర్ ఆపరేటర్లు సందీప్, సంధ్య బుధవారం నల్లబ్యాడ్జీలు ధరించి విధులు నిర్వహించారు. వారు మాట్లాడుతూ కొందరు మీసేవా ఉద్యోగులను చులకన చేయడంతో పాటు దాడులు చేస్తున్నారని వాపోయారు. హైదరాబాద్‌లోని సుచిత్ర సెంటర్ మీసేవా కేంద్రంలో జరిగిన దాడిని ఖండిస్తున్నామన్నారు. దాడికి పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

అయ్యప్పస్వామి అభిషేక మహోత్సవం



అన్నదానం చేస్తున్న క్లబ్ ప్రతినిధులు

సుల్తానాబాద్: మండల కేంద్రంలోని నీరుకుల్ల రోడ్డులో ఉన్న అయ్యప్పస్వామి ఆలయంలో అయ్యప్పస్వామి మూల విరాట్టుకు బుధవారం అభిషేకం నిర్వహించారు. అర్చకులు రవీందర్ ఆచార్యుల సారథ్యంలో స్వామికి పంచామృత సహిత ఫలాభిషేకం, అలంకారం, పుష్పార్చన, దూప దీపం, మహా నైవేద్యం, మహాహారతి, మంత్రపుష్పం నిర్వహించారు.

సీఎం సభలో పారిశుధ్య కార్మికుల ఆకలి కేక

కోల్‌సిటీ: జిల్లా కేంద్రంలో బుధవారం జరిగిన సీఎం రేవంత్‌రెడ్డి సభకు, రామగుండం నగర పాలక సంస్థ నుంచి సుమారు 150 మంది పారిశుధ్య కార్మికులు అధికారుల ఆదేశాల మేరకు తరలివెళ్లారు. ఒక్కో జోన్ నుంచి ఐదుగురు పురుషులు, మరో ఐదురుగు మహిళా కార్మికులను తరలించారు. ఉదయం 8 గంటలకే సభాస్థలికి చేరుకున్న పారిశుధ్య కార్మికులకు, సాయంత్రం 7 గంటల వరకు కూడా కనీసం భోజనాలు పెట్టకపోవడంతో కార్మికులు ఆకలితో అలమటించారు. ఆకలి తట్టుకోలేక మున్సిపల్ అధికారులకు ఫోన్ చేస్తే, వారికి సంబంధం లేదన్నట్లు వ్యవహరించారని కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. బల్దియా అధికారుల నుంచి సరైన స్పందన రాకపోవడంతో, చివరికి కాలేకడుపుతోనే తిరిగి ఇంటికి చేరుకున్నారు. ఇదే విషయంపై హెల్త్ ఇన్‌స్పెక్టర్ సునీల్ రాథోడ్‌ను వివరణ కోరగా, సభ ప్రాంతంలో సెక్యూరిటీ ప్రాబ్లమ్‌తో కొంత ఆలస్యమైయిప్పటికీ, సీఎం వచ్చే సమయానికి భోజనాలు సమకూర్చామని తెలిపారు.

ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడిగా రజినీకాంత్

గోదావరిఖనిటౌన్: మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి జిల్లా అధ్యక్షుడిగా బచ్చల రజినీకాంత్‌ను నియమించినట్లు రాష్ట్ర కోఆర్డినేటర్ మాతంగి ఓదెలు మంగళవారం పేర్కొన్నారు. తన నియామకానికి కృషి చేసిన నాయకులకు రజినీకాంత్ కృతజ్ఞతలు తెలిపారు.

అన్నదానం

సుల్తానాబాద్: లయన్స్ క్లబ్ ఆఫ్ సుల్తానాబాద్ ఆధ్వర్యంలో బుధవారం లయన్ జీఎల్టీ కో–ఆర్డినేటర్ మిట్టపల్లి ప్రవీణ్ కుమార్ పుట్టిన రోజు సందర్భంగా మండల కేంద్రంలోని స్థానిక వికాసం దివ్యాంగుల కేంద్రంలోని చిన్నారులకు అన్న వితరణ చేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు మాటేటి సంజీవ్‌కుమార్, జిల్లా కో–ఆర్డినేటర్ వల్స నీలయ్య, పిట్టల వెంకటేశం, పూసాల సాంబమూర్తి, కోడూరి సతీశ్, ఆడెపు సదానందం, తమ్మనవేణి సతీశ్, దాసరి ప్రసాద్ పాల్గొన్నారు.

యథేచ్ఛగా మట్టి తరలింపు

- ఎమ్మెల్యే, కలెక్టర్ హెచ్చరించినా ఆగని అక్రమ రవాణా
- దృష్టిసారించని అధికారులు





సుల్తానాబాద్ పట్టణ శివారులో పొలంలో మట్టిపోసిన అక్రమార్కులు

టిప్పర్ ద్వారా మట్టి తరలింపు

సుల్తానాబాద్: పట్టణం చుట్టుపక్కల నుంచి అక్రమార్కులు రాత్రివేళ టిప్పర్ల ద్వారా అక్రమంగా మట్టి తరలిస్తున్నారు. అధికారులు చూసీ చూడనట్టు వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ స్థలాలు, గుట్టలు, చెరువు శిఖాల నుంచి అక్రమంగా మట్టి తవ్వకాలు జరుపుతూ ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు.

ఎమ్మెల్యే, కలెక్టర్ హెచ్చరించినా..

మట్టి తరలించొద్దని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు, కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించినా అక్రమార్కులు మాత్రం మట్టి అక్రమ రవాణా ఆపట్లేదు. స్థానిక అధికారులకు తెలిసినప్పటికీ భూగర్భ గనులశాఖ అధికారులు పట్టుకోవాల్సి ఉందని, పట్టుకోకుండా ఉండడంతో తమ శాఖలకు సంబంధం లేదని చెప్పుకొస్తున్నారు.

ప్రభుత్వ భూములే లక్ష్యం

పేదలు, నిరుపేదలు, బీపీఎల్‌లో ఉన్నవారికి, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు పదేళ్ల క్రితం కాంగ్రెస్ హయాంలో భూములు పంపిణీ చేశారు. సదరు భూములపై కొందరు అక్రమార్కుల దృష్టిపడింది. అందులో నుంచి మట్టిని అక్రమంగా రవాణా చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారని విమర్శలు ఉన్నాయి. ప్రభుత్వ, ప్రైవేట్ భూముల్లో మట్టి తవ్వకాలు చేయాలంటే తప్పనిసరిగా సంబంధిత శాఖ అధికారులకు అనుమతి తీసుకోవాలి. కానీ అక్రమార్కులు అవేమీ పట్టించుకోవడం లేదు. అధికారులు దృష్టిసారించి అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

మట్టి తరలింపు అడ్డుకోవాలి



సుల్తానాబాద్‌తో పాటు పలు ప్రాంతాల్లో రాత్రివేళలో అక్రమంగా టిప్పర్ల ద్వారా మట్టిని సరఫరా చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా మట్టిని తరలిస్తున్న వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలి. వాహనాలను సీజ్ చేసి భారీగా జరిమానా విధించాలి. దీంతో ఇలాంటివి పునరావృతం కావు.

– సూర శ్యామ్, మాజీ ఎంపీటీసీ, సుల్తానాబాద్

చర్యలు తీసుకుంటాం



సుల్తానాబాద్‌తో పాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో మట్టి తరలించేందుకు ఎలాంటి అనుమతి పత్రాలు అందలేదు. అక్రమంగా తరలిస్తున్నట్టు తెలిస్తే వెంటనే పోలీస్, రెవెన్యూ అధికారులకు సమాచారం ఇవ్వాలి. ప్రభుత్వ ఆదాయానికి గండిపడేలా చేస్తున్న అక్రమార్కులపై చర్యలు తీసుకుంటాం.

– మధుసూదన్‌రెడ్డి, తహసీల్దార్, సుల్తానాబాద్

ఎన్టీపీసీ ఉద్యోగులకు అండగా ఐఎన్టీయూసీ



బాబర్‌ను సన్మానిస్తున్న యూనియన్ నాయకులు

జ్యోతినగర్: ఎన్టీపీసీ సంస్థ ఉద్యోగులకు ఐఎన్టీయూసీ అండగా ఉంటుందని ఐఎన్టీయూసీ జాతీయ సీనియర్ కార్యదర్శి, ఎన్టీపీసీ ఎన్సీసీ సభ్యుడు బాబర్ సలీంపాషా అన్నారు. ఎన్టీపీసీ రామగుండం పర్మినెంట్ టౌన్‌షిప్‌లోని మజ్దూర్ యూనియన్ కార్యాలయంలో ఎన్టీపీసీ కెన్హా ప్రాజెక్టులో ఐఎన్టీయూసీ ఘన విజయం సాధించడంపై బుధవారం అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 284 ఓట్లు సాధించి కెన్హా ప్రాజెక్టులో యూనియన్ విజయం సాధించడంపై కెన్హా ప్రాజెక్టు ఉద్యోగులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కెన్హా ప్రాజెక్టులో విజయం సాధించడంపై ఐఎన్టీయూసీ జాతీయ సీనియర్ కార్యదర్శిని ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టు ఉద్యోగ గుర్తింపు సంఘం (ఐఎన్టీయూసీ అనుబంధం) వర్కింగ్ ప్రెసిడెంట్ వేముల కృష్ణయ్య, ప్రధాన కార్యదర్శి ఆరెపల్లి రాజేశ్వర్ సన్మానించారు. కార్యక్రమంలో ఐఎన్టీయూసీ నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్, బీజేపీ నాయకుల ముందస్తు అరెస్టు



మంథని: పోలీసుల అదుపులో నాయకులు



సుల్తానాబాద్‌రూరల్: బీజేపీ నాయకులు



కాల్వశ్రీరాంపూర్ పోలీస్‌స్టేషన్‌లో..

మంథని/ఎలిగేడు/జూలపల్లి/యైటింక్లయిన్‌కాలనీ/ధర్మారం/పాలకుర్తి/ముత్తారం/రామగిరి/సుల్తానాబాద్‌రూరల్/కమాన్‌పూర్/ఓదెల: జిల్లా కేంద్రంలో బుధవారం నిర్వహించిన యువ వికాస్ విజయోత్సవ సభ, సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన నేపథ్యంలో బీఆర్ఎస్, బీజేపీతో పాటు ఇతర పార్టీల నేతలను బుధవారం అదుపులోకి తీసుకున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి భారీ బహిరంగ సభ ఉన్నందున ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు వివిధ పార్టీల నాయకులను ముందస్తుగా అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు.



సుల్తానాబాద్: సభకు తరలుతున్న నాయకులు



ఓదెల నుంచి సీఎం సభకు వెళ్తున్న నాయకులు

సీఎం సభకు తరలిన జనం



కమాన్‌పూర్: సభకు వెళ్తున్న మహిళలు

మంథని/ఎలిగేడు/జూలపల్లి/కమాన్‌పూర్/సుల్తానాబాద్: పెద్దపల్లిలో బుధవారం నిర్వహించిన సీఎం సభకు మంథని, రామగుండం, పెద్దపల్లి నియోజకవర్గాల నుంచి కాంగ్రెస్ శ్రేణులు తరలివెళ్లారు. కాంగ్రెస్ శ్రేణులతో పాటు స్వశక్తి సంఘాల మహిళలను తరలించేందుకు ఆర్టీసీ, అద్దె బస్సులు వినియోగించారు. గ్రామీణ ప్రాంతాలకు బస్సులు రద్దు కావడంతో జనం ఇబ్బంది పడ్డారు. ఆర్టీసీ బస్సులతో పాటు స్కూలు, ఇతర ప్రైవేటు వాహనాలన్నీ పెద్దపల్లి సభకు వెళ్లడంతో అత్యవసర ప్రయాణాలకు జనం ఇబ్బంది పడ్డారు.

ప్రజాపాలన పేరుతో రాక్షస పాలన



మాట్లాడుతున్న నాయకులు

జ్యోతినగర్: ప్రజాపాలన పేరుతో రాష్ట్రంలో రాక్షస పాలన కొనసాగుతోందని బీజేపీ పార్లమెంట్ కోకన్వీనర్ గుండబోయిన లక్ష్మణ్‌యాదవ్, బీఆర్ఎస్ కార్పొరేటర్లు కృష్ణవేణి, శ్రీనివాస్ అన్నారు. పెద్దపల్లిలో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన నేపథ్యంలో బుధవారం బీఆర్ఎస్, బీజేపీ నాయకులను ముందస్తుగా అరెస్టు చేసి ఎన్టీపీసీ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఎన్టీపీసీ మండల అధ్యక్షుడు మిట్టపల్లి సతీశ్ కుమార్, బీఆర్ఎస్ అధికార ప్రతినిధి ఈదునూరి శ్రీకాంత్ పాల్గొన్నారు.

బస్టాండ్‌లో సొమ్మసిల్లిన వృద్ధురాలు



గంగవ్వను ఆసుపత్రికి తరలిస్తున్న సిబ్బంది

పెద్దపల్లిరూరల్: పట్టణంలోని బస్టాండ్‌లో బుధవారం గంగవ్వ అనే వృద్ధురాలు ఛాతీలో నొప్పిగా ఉందంటూ కుప్పకూలింది. అప్రమత్తమైన సెక్యూరిటీ సిబ్బంది 108 వాహనానికి సమాచారం అందించారు. రామగుండంకు చెందిన గంగవ్వ, తన బంధువు సువర్ణతో కలిసి పని నిమిత్తం పెద్దపల్లికి వచ్చారు. తిరిగి ఇంటికి వెళ్లేందుకు బస్టాండ్‌కు రాగా అస్వస్థతకు గురికావడంతో ఆసుపత్రికి తరలించారు.

డైనింగ్ హాల్ నిర్మాణం పూర్తిచేయండి



జూలపల్లి: మండలంలోని వడ్కాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రెండేళ్ల క్రితం మన ఊరు–మన బడి నిధులతో డైనింగ్ హాల్ నిర్మించేందుకు పనులు ప్రారంభించారు. నిధులు రావడం లేదని గుత్తేదారు స్లాబు వేయకుండానే వదిలి పెట్టాడు. దీంతో విద్యార్థులకు భోజన ఇబ్బందులు తప్పడం లేదు. డైనింగ్ హాలు పూర్తి చేసి విద్యార్థుల ఇబ్బందులు తొలగించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

సంక్షిప్త వార్తలు

• నియామకం

పాలకుర్తి: జాతీయ బీసీ సంక్షేమ సంఘం మండల మహిళా అధ్యక్షురాలిగా మండలంలోని పుట్నూర్ గ్రామానికి చెందిన పడాల అనిత నియమితులయ్యారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బొద్దుల అరుణ మంగళవారం నియామకపత్రం అందజేశారు. తన నియామకానికి సహకరించిన సంఘం జిల్లా అధ్యక్షుడు మనోజ్‌గౌడ్, రామగుండం నియోజకవర్గ అధ్యక్షుడు సురేశ్, మహిళా నాయకులు శైలజ, మౌనికకు అనిత కృతజ్ఞతలు తెలిపారు.

• బీసీ సంక్షేమ సంఘం మండలం అధ్యక్షురాలిగా శైలజ

జ్యోతినగర్: జాతీయ బీసీ సంక్షేమ సంఘం రామగుండం మండలం మహిళా అధ్యక్షురాలిగా దొడ్డిపట్ల శైలజను నియమిస్తూ జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా మహిళా ప్రధాన కార్యదర్శి బొద్దుల అరుణ నియామక ఉత్తర్వులు అందజేశారు. ఎన్టీపీసీ రామగుండం అన్నపూర్ణకాలనీకి చెందిన శైలజను జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య సూచన మేరకు ఈ నియామకం చేసినట్లు అరుణ తెలిపారు. తన నియామకానికి సహకరించిన బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు మనోజ్ గౌడ్, ప్రధాన కార్యదర్శి పొన్నం ప్రసాద్‌గౌడ్, రామగుండం నియోజకవర్గం అధ్యక్షుడు వింజమూరి సురేశ్, బీసీ నాయకులు దగ్గుల రమాదేవి, ఆరెపల్లి లావణ్యకు శైలజ కృతజ్ఞతలు తెలిపారు.

• సీఎంకు ఓదెల మల్లికార్జునస్వామి చిత్రపటం బహూకరణ

ఓదెల: పెద్దపల్లి బహిరంగ సభలో బుధవారం సీఎం రేవంత్‌రెడ్డికి పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు ఓదెల మల్లికార్జునస్వామి చిత్రపటం బహూకరించారు. ఓదెల మల్లికార్జునస్వామి దేవస్థానం అభివృద్ధికి నిధుల మంజూరు గురించి సీఎం దృష్టికి తీసుకెళ్లగా సానుకూలంగా వ్యక్తం చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు.



పందిల్లలో పోచమ్మ బోనాలు

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని పందిల్ల గ్రామంలో ముదిరాజ్ కులస్తులు బుధవారం పోచమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా డప్పుచప్పుల్ల తో నెత్తిన బోనాలతో, శివసత్తుల పూనకాలతో మహిళలు ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.



ధర్మారం: మండలంలోని దొంగతుర్తి గ్రామంలో విద్యుత్‌శాఖ అధికారులు ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల పరిస్థితి అధ్వానంగా ఉంది. గ్రామంలో దాదాపు 25 విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్నాయి. దాదాపు అన్ని ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ గడ్డి, పిచ్చిమొక్కలు పెరిగాయి. ట్రాన్స్‌ఫార్మర్ ఫీజులు పోతే సంబంధిత అధికారులు అందుబాటులో ఉండరని తామే వెళ్లి ఫీజులు వేసుకుంటున్నట్లు గ్రామ మాజీ ఎంపీటీసీ దాడి సదయ్య వాపోయారు. సంబంధిత అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ ఉన్న పిచ్చిమొక్కలు తొలగించాలని రైతులు కోరుతున్నారు.

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 97053 46608, 98499 71500

సింగరేణి వార్తలు

బాధితులకు చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న అధికారులు

గోదావరిఖని: జీడీకే–7ఎల్‌ఈపీ గని ప్రమాదంలో ఇన్‌చార్జి మేనేజర్ తీట్ల సత్యనారాయణ మృతి చెందగా ఆయన కుటుంబానికి బుధవారం ఆర్జీ–2 యాజమాన్యం ఎక్స్‌గ్రేషియా చెక్కు అందజేసింది. జీఎం వెంకటయ్య ఆదేశాల మేరకు సత్యనారాయణ కుటుంబానికి స్పెషల్ ఎక్స్‌గ్రేషియా రూ.15లక్షలు, మరో ఎక్స్‌గ్రేషియా రూ.90వేలు యూనియన్ ప్రతినిధుల సమక్షంలో కుటుంబ సభ్యులకు అందించారు. డీవైపీఎం శ్యాంప్రసాద్, బ్రాంచ్ సెక్రటరీ రవీందర్, నాయకులు శ్యాంసన్ పాల్గొన్నారు.

సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలు పెంచాలి



వేతనాలు పెంచాలని లేఖ ప్రదర్శిస్తున్న కార్మికులు

గోదావరిఖని: సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు వేతనాలు పెంచాలని కాంట్రాక్టు కార్మికులు కోరారు. ఆర్జీ–2 ఏరియాలోని పలు డిపార్ట్‌మెంట్లలో బుధవారం సీఎం లేఖతో కూడిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా కమిటీ సభ్యులు ఉల్లి మొగిలి మాట్లాడుతూ కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరిస్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క హామీ ఇచ్చి ఏడాది గడుస్తున్నా ఇప్పటివరకు అమలు కాలేదన్నారు. నాయకులు భూమయ్య, రామన్న, రాజేశ్, లక్ష్మణ్, లక్ష్మీనారాయణ, రవి, రషీద్‌ఖాన్, సీహెచ్ రాజు, నాగరాజు, మల్లేశ్, వి.రవి పాల్గొన్నారు.

జాతీయస్థాయి కరాటే పోటీల్లో ప్రతిభ



పతకాలు సాధించిన విద్యార్థులు

జ్యోతినగర్: జాతీయస్థాయి కరాటే పోటీల్లో ఎన్టీపీసీ రామగుండం అన్నపూర్ణకాలనీ విశ్వభారతి విద్యార్థులు ప్రతిభ కనబరిచి బంగారు పతకాలు సాధించారు. ఒకినోవా మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో మహారాష్ట్ర పూణేలో జరిగిన 27వ నేషనల్ కరాటే ఛాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించారు. విశ్వభారతి విద్యార్థులు బంగారు, వెండి, ప్రశంసా పత్రాలు అందుకున్నారు. బుధవారం పూణే నుంచి వచ్చిన సందర్భంగా వారికి స్వాగతం పలికారు. చైర్మన్ బందారపు యాదగిరిగౌడ్, హెచ్ఎం తిరుపతిగౌడ్, ప్రిన్సిపాల్ ప్రవీణ్‌కుమార్, ఇన్‌చార్జిలు జగన్, మధుకర్, అశోక్ అభినందించారు.

స్వల్పంగా కంపించిన భూమి.. ఉలిక్కిపడ్డ ప్రజలు



సుల్తానాబాద్: బయటకు పరుగులు తీసిన ప్రజలు

రామగిరి: వివిధ గ్రామాల్లో ఉదయం కాసేపు భూప్రకంపనలు ప్రజలను భయకంపితులను చేశాయి. జనం ఒక్కసారి ఉలిక్కిపడి ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. ఆదివారంపేటలో ఇంటి గోడకు పగుళ్లు ఏర్పడ్డాయి.

నారాయణరావు పల్లెలో సామగ్రి చిందరవందర

సుల్తానాబాద్‌రూరల్: మండలంలోని వివిధ గ్రామాల్లో బుధవారం ఉదయం భూప్రకంపనలకు ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. మండల పరిధిలోని నారాయణరావు పల్లెలో ఇళ్లలోని సామగ్రి చిందర వందరయ్యాయి.

సుల్తానాబాద్: పట్టణంలోని పలు కాలనీల్లో బుధవారం ఉదయం 3సెకన్ల పాటు భూమి స్వల్పంగా కంపించినట్లు స్థానికులు తెలిపారు. దీంతో ప్రజలు ఇంటి నుంచి బయటకు పరుగులు తీశారు.



చిన్నారుల క్రీడా పరికరాల బిగింపుపై నిర్లక్ష్యం

గోదావరిఖని: పెద్దపల్లి ఎల్లమ్మ చెరువుకట్టపై చిన్నారుల కోసం ఏర్పాటు చేసిన ఆట వస్తువులు సరైన విధంగా బిగించకపోవడంతో ఊడిపోతున్నాయి. దీంతో చోరీకి గురయ్యే అవకాశం ఉంది. ఎల్లమ్మ చెరువు కట్టపై వీధిదీపాలు స్తంభాల కనెక్షన్ బోర్డులు ఓపెన్ చేసి ఉండటంతో విద్యుత్ ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని స్థానికులు అంటున్నారు.